2016, నవంబర్ 'స్వాతి' సచిత్ర మాసపత్రికలో

ఉత్తమ నవలగా ఎంపిక కాబడిన పుస్తకం

# మనుషులు మమతలు















పెబ్బిలి హైమావతి

# మనుషులు... మమతలు

"ఉక్ష రాజ వాహనస్య జీవితాద్ధరీయసీ...
పక్షి రాజ వాహనాది వర్ధమాన వైభవా...
కేకిలోక చక్రవర్తి వాహనేన పుత్రిణీ...
వారణారి సార్వభౌమ వాహనాగతిర్మతీ!"...

అంటూ కళ్లు మూసుకొని రెండు చేతులూ జోడించి తలవంచి నమస్కారం చేసింది సావిత్రమ్మ. ఆమె పక్కనే కూర్చున్న అన్నపూర్ణ కర్పూరం వెలిగించి "సర్వ మంగళ మాంగల్యే శివే సర్వార్ధ సాధకే..." అంటూ హారతి ఇచ్చి నమస్కరించింది.

అది రోజూ చూస్తున్న దృశ్యమే అయినా... శ్రీకాంత్‌కి ఆ అత్తా కోడళ్లిద్దరూ కలిసి పూజ చేసుకోవడం ఎప్పటికప్పుడు కొత్తగానే ఉంటుంది.

అత్తా కోడళ్లిద్దరికీ సహజంగా జాతివైరం అనే మాటను... వాళ్లను చూసి ఉపసంహరించుకోవలసిందే ఎవరైనా అనుకుంటూ ఉంటాడు ఎప్పుడూ.

ప్రయాణానికి సిద్ధమై బేగ్ పక్కన పెట్టుకొని నుంచున్న మనవడి వంక ఆశ్చర్యంగా చూస్తూ "అదేమిటి శ్రీ, అప్పుడే రెడీ అయిపోయావు... భోజనం చేసి వెళ్లవూ? నీ కోసమని ఈరోజు పూజ త్వరగా ముగించేశాము" అంది.

"నాకోసం హైరానా పడకండి నానమ్మా... నేను అనకాపల్లిలో జానకత్త వాళ్లింట్లో తిని ట్రైనెక్కుతాను... అత్త కూడా శరత్ కోసం ఏవో చేసి పెట్టిందట... పట్టుకు వెళ్లమని ఫోన్ చేసి చెప్పింది!" అన్నాడు శ్రీకాంత్.

"సరే అయితే, జాగ్రత్తగా వెళ్లిరా శ్రీ!" అంది సావిత్రమ్మ మనవడి వంక ఆప్యాయంగా చూస్తూ.

"నానమ్మా... మీరిద్దరూ కొలిచే దేవతలతో నాకీ ఉద్యోగం వచ్చేలా చూడమని సిఫారసు చేయరాదా?" అన్నాడు హాస్యంగా.

"తప్పు నాన్నా అలా హాస్యంగా మాట్లాడకు. ఆతల్లికి ఎవరిగూర్చి ఎవరికీ సిఫారసు చేయనవసరం లేదురా అన్నీ ఆ తల్లే చూసుకుంటుంది. తన బిడ్డలకు ఎప్పుడు ఏది

ఇవ్వాలో ఆమెకు బాగానే తెలుసు నువ్వు ధైర్యంగా వెళ్లిరా అంతా శుభమే జరుగుతుంది!" అంది అన్నపూర్ణ నమ్మకంగా కొడుకు వంక చూస్తూ.

"అవును శ్రీ మనం ఏ పని మొదలుపెట్టినా అంతా మంచే జరుగుతుంది అనుకోవాలి గానీ చెడు జరుగుతుంది అనుకోకూడదురా ఉదయం తాతగారు నీతో అదేకదా చెప్పారు పాజిటివ్ థింకింగ్ మనకి ధైర్యాన్నిచ్చి ముందుకు నడిపిస్తే నెగెటివ్ థింకింగ్ మనల్ని నీరు కార్చి పాతాళానికి నెట్టేస్తుందని" అంది సావిత్రమ్మ ఆప్యాయంగా మనవడి వంక చూస్తూ.

"నానమ్మా, ఏం చదువుకోలేదంటావు గానీ ఇంగ్లీషు భలే మాట్లాడుతున్నావే... సరే, నువ్వు చెప్పినట్లే చేస్తానులే!" అన్నాడు శ్రీకాంత్.

"అరే మాట మార్చకురా, అయినా ఇంతమంది విద్యావంతులు ఇంట్లో ఉన్నప్పుడు ఆమాత్రం ఇంగ్లీషు ముక్కలు నాకు ఒంటబట్టవంటావా? సరేగాని నాన్నా అనవసరంగా లేనిపోని అనుమానాలతో మనసు పాడు చేసుకోకు. అయినా నీకేం తక్కువనిరా అలా ఫీలవుతున్నావు! అన్ని క్వాలిఫికేషన్స్ ఉన్న నీకు గాక ఇంకెవరికి వస్తుందిరా ఉద్యోగం? నీకెందుకు నేను చెప్తున్నాను కదా... ఈ ఉద్యోగం నీకు వచ్చి తీరుతుంది ... ఆత్మవిశ్వాసంతో అటెండయిరా, అంతా జయమే కలుగుతుంది!" అంది సావిత్రమ్మ.

"శ్రీ, తాతగారి ఆశీర్వచనం తీసుకొని బయలుదేరు!" అంది అన్నపూర్ణ.

"అవన్నీ మీరు పూజలో ఉన్నపుడే పూర్తయిపోయాయమ్మా ... మీకు చెప్పివెళదామనే ఇంతసేపూ ఆగాను" అన్నాడు శ్రీకాంత్ బేగ్ చేతిలోకి తీసుకుంటూ.

"సరే వెళ్లిరా నాన్నా..." అని మనవడికి చెప్పి కోడలి వైపు తిరిగి "పూర్ణా, శ్రీకి ఎదురురా!" అంది సావిత్రమ్మ.

"పెద్దవారు మీరే వెళ్లండి అత్తయ్యా!" అంది అన్నపూర్ణ.

"నీదో చాదస్తం..." అంటూ సావిత్రమ్మ మనవడికి ఎదురువెళ్లి "బెస్ట్ ఆఫ్ లక్ నాన్నా!" అంది నిండుగా నవ్వుతూ.

"థేంక్స్ నానమ్మా... అమ్మా, వెళ్లొస్తాను!" అంటూ ఇద్దరికీ చెప్పి చకచకా బయటకు నడిచాడు శ్రీకాంత్.

వెళ్తున్న మనవడి వంకే చూస్తూ "పూర్ణా, వీడికీ మధ్య ప్రతిదానికీ సందేహమే కలుగుతోంది... ఏ పని మొదలు పెట్టినా, అవుతుందా లేదా అని మీమాంసే! చూశావా, ఇప్పుడెంత ఆలోచిస్తున్నాడో పిచ్చి సన్యాసి!" అంది సావిత్రమ్మ.

"పాపం వాడు మాత్రం ఏం చేస్తాడత్తయ్యా? ఎన్ని ప్రయత్నాలు చేసినా ఏదీ కలిసి రావడం లేదు ... అందుకే అంత నిరుత్సాహం!" అంది అన్నపూర్ణ.

"అలా ఎందుకనుకోవాలి పూర్ణా? ఇంత జాప్యం జరుగుతోందంటే వాడికోసం ఇంకా ఏదో మంచి అవకాశం ఎదురు చూస్తోందని ఎందుకు అనుకోకూడదు? అయినా వాడికి ఉద్యోగాలు రాకపోవడం ఏమిటి? వచ్చిన చిన్నా చితకా

ఉద్యోగాలను మనమే కదా వద్దనుకున్నాము!" అంది సావిత్రమ్మ.

"అదే వాడు చేసిన తప్పు అత్తయ్యా... ఇంటి పరిస్థితి దృష్టిలో పెట్టుకొని ఉంటే... శరత్‌తో పాటు వాడు కూడా జాబ్‌లో జాయిన్ అయ్యేవాడు. మనకి కూడా ఆర్థికంగా ఎంతో వెసులుబాటుగా ఉండేది. వీడికి జాబ్ లేదు.

విద్య పెళ్లికి సిద్ధంగా ఉంది. ఆయన రిటైర్‌మెంటుకు దగ్గర పడ్డారు. భవిష్యత్ తలచుకుంటే చాలా బెంగగా ఉందత్తయ్యా!" అంది అన్నపూర్ణ దిగులుగా చూస్తూ.

"ఎందుకమ్మా దిగులు? నువ్వలాంటి భయాలేమీ పెట్టుకోకు... అన్నీ వాటంతట అవే సవ్యంగా జరుగుతాయి. క్రిష్ణ అంటే అందరికీ ఎంతో అభిమానం... వాళ్లందరికీ వాడు ఎంతో చేశాడు. ఇప్పుడు వాడి బాగోగులు వాళ్లు చూడరంటావా?

ముఖ్యంగా దివాకర్‌కి విద్య అంటే ప్రాణం కదూ... ఆడపిల్లలు లేని దివాకర్ విద్యను స్వంత బిడ్డలా చూసుకుంటున్నాడు. ఈ రెండేళ్లూ దగ్గర ఉంచుకొని ఎం.ఏ చెప్పించాడు. ఇంతకంటే ఏం కావాలి? పైగా మన జానకి ఎప్పుడో చెప్పింది కదా... విద్యని శరత్‌కి చేసుకుంటానని... ఇంకా ఎందుకమ్మా నీకు దిగులు?" అంది సావిత్రమ్మ ఓదార్పుగా.

"జానకి పెద్దమనసుతో చేసుకుంటుంది సరే ... వాళ్లింటికి మన పిల్లను ఉత్తచేతులతో ఎలా పంపుతాము అత్తయ్యా?" అంది అన్నపూర్ణ.

"పూర్ణా, అనవసరంగా ఎక్కువ ఆలోచించి మనసు పాడుచేసుకోకు... ఇందాక మన శ్రీకి ఏం చెప్పానో నీకూ అదే చెప్తున్నాను. అంతా మంచే జరుగుతుందని నమ్మకంతో ఉండు... భారమంతా మనం నిత్యం కొలిచే ఆ తల్లి మీద వేసి నిశ్చింతగా ఉండు.

మన శ్రీకి ఈ ఉద్యోగం తప్పక వస్తుంది. వాడికి ఉద్యోగం వస్తే అన్ని సమస్యలూ చిటికెలో తీరిపోతాయి. రేపు మనవాడు శుభవార్తతో తిరిగిరాకపోతే నన్నడుగు!" అంది సావిత్రమ్మ ఆశాభావంతో.

"మీ నోటి చలువ వలన అలా జరిగితే ... అంతకంటే కావలసింది ఏముందత్తయ్యా?" అంది అన్నపూర్ణ.

***

కాలింగ్‌బెల్ మోతకి గాఢనిద్రలో ఉన్న శరత్ ఉలిక్కిపడి లేచాడు.

"ఎవర్రా బాబూ ఇంత పొద్దున్నే... బంగారం లాంటి నిద్ర పాడుచేశారు!" అని గొణుక్కుంటూ తలుపు తీశాడు... ఎదురుగా శ్రీకాంత్ కనిపించడంతోనే అతడి చికాకంతా ఎగిరిపోయి దాని స్థానంలో ఆనందం చోటుచేసుకుంది.

"ఏంట్రా శ్రీ ... ఇంత హఠాత్తుగా ఊడిపడ్డావు? ఫోన్ చేస్తే స్టేషన్‌కి వచ్చేవాడిని కదా!" అన్నాడు శ్రీకాంత్‌ని ఆలింగనం చేసుకుంటూ.

"నిన్ను సర్‌ప్రైజ్ చేద్దామని చెప్పలేదు... ఇంట్లో వాళ్లని కూడా ఫోన్ చెయ్యవద్దని చెప్పాను... తీరా ట్రైన్ ఎక్కాక నాకే మనసు లాగింది నీతో మాట్లాడాలని. తీరా ఫోన్ కోసం చూస్తే లేదు... అది మీ ఇంట్లో మరిచిపోయినట్లున్నాను" అన్నాడు శ్రీకాంత్.

"మంచిపనయిందిరా ... బాగా కుదిరిందా తిక్క? లేకపోతే నాతోనా ఆటలు..." అంటూ అతని భుజం చుట్టూ చేయివేసి లోపలికి తీసుకువచ్చాడు శరత్.

"ఇంతకీ నీ అకాల ఆగమనానికి కారణం ఏమిటో చెప్పలేదు" అన్నాడు శరత్ శ్రీకాంత్ చేతిలోని బేగ్ తీసుకొని పక్కన పెడుతూ.

అక్కడ ఉన్న కుర్చీలో కూర్చుని బద్ధకంగా ఒళ్లు విరుచుకుంటూ "ఏం చెప్పమంటావురా బాబూ, ఇంటర్వ్యూకి వచ్చాను. నీకేం చక్కగా కేంపస్ సెలక్షన్‌లో మంచి జాబ్ కొట్టేశావు. చూడు నా పాట్లు ఎలా ఉన్నాయో!" అన్నాడు శ్రీకాంత్ నిరాశగా.

"పోరా బడుద్దాయి, కాళ్ల దగ్గరకు వచ్చిందాన్ని నువ్వే కదా ఒద్దు పొమ్మన్నావు ... నాతో పాటు కేంపస్‌లో సెలక్షన్ వస్తే కాదు పొమ్మని ఎం.టెక్‌లో చేరావు" అన్నాడు శరత్.

"అరే బాబూ, అది నా తప్పు కాదురా... దివాకర్ బాబాయి నాకు వచ్చిన మార్కులు చూసి పట్టుబట్టి ఎంటెక్ చేయించారు. అది నీకు తెలిసి కూడా తప్పు నాదంటున్నావు. ఇదేమైనా న్యాయంగా ఉందా నీకు?" అన్నాడు జాలిగా.

"పోనీ అది వదిలేద్దాం! మా నాన్నగారు ఏం చెప్పారు? విశాఖలో గాయిత్రీ ఇంజనీరింగ్ కాలేజీలో వేకెన్సీలు ఉన్నాయి, లెక్చరర్‌గా చేరమంటే చేరావా నువ్వు? పోనీ మన చక్రి చేస్తున్నాడు కదా, రాజాం జియంఆర్‌లో... అందులో అయినా జాయిన్ అవ్వచ్చు కదా?" అన్నాడు శరత్.

"అదేరా నేను చేసిన తప్పు... ఈ జాబ్ కానీ రాకపోతే, ఏదో ఒక కాలేజీలో జాయిన్ అయిపోతాను... కానీ ఎందుకనో నాకు మొదటి నుండీ టీచింగ్ ప్రొఫెషన్ అంటే ఇష్టం లేదురా!" అన్నాడు శ్రీకాంత్ దిగులుగా.

అతడి ముఖంలో దిగులు చూడగానే శరత్ మనసు ఆర్ద్రమైంది.

"అరే శ్రీ! ఏదో సరదాగా నిన్ను టీజ్ చేయాలని అన్నానురా... ఊరికే ఎందుకురా అంత దిగులు పడిపోతావు? ఎంటెక్‌తో పాటు అన్ని కోర్సులు చేశావు... నీ క్వాలిఫికేషన్స్ చూసి ఎవరైనా కళ్లకు అద్దుకొని ఉద్యోగం ఇస్తారు" అన్నాడు ఓదార్పుగా.

వాళ్లిద్దరూ చిన్నప్పటి నుండీ కలిసిమెలిసి పెరగడం వలన... ఒకరంటే ఒకరికి ప్రాణం. ఎవరు బాధపడినా, రెండోవాళ్లు చూడలేరు.

శరత్ ఓదార్పు మాటలతో కొంచెం తెప్పరిల్లిన శ్రీకాంత్... తాను తెచ్చిన బేగ్ ఓపెన్ చేసి సావిత్రమ్మ, జానకి ఇచ్చిన పార్సెల్ తీసి "ఇదిగోరా, ఈ సున్ని ఉండలు, అరిశెలు నాన్నమ్మ ఇచ్చింది. ఈ జంతికలూ, గవ్వలూ, అత్తయ్య ఇచ్చింది" అంటూ వాటిని శరత్ చేతికి ఇచ్చాడు.

శరత్ వాటిని ఆప్యాయంగా అందుకొని వాసన చూస్తూ "ఎంత కమ్మగా ఉందో వాసన ఏదో అమ్మ చేసిందంటే సరే అనుకోవచ్చు! అమ్మమ్మకి ఈ వయసులో కూడా ఎంత ఓపికరా... ఇవన్నీ చేయడానికి? పోన్లే వారం రోజుల పాటు నాకు బ్రేక్‌ఫాస్ట్‌కి చేసుకునే శ్రమ తప్పింది" అన్నాడు.

వంట తానే స్వయంగా చేసుకుంటాడు కనుక ఏ కొంచెం పని తప్పినా తప్పిందనే సంతోషిస్తాడు శరత్.

అతడి మాటలు వింటూనే శ్రీకాంత్ బెదురుగా చూస్తూ "ఒరే నాన్నా... నీలా పొద్దున్నే నేను స్వీట్స్ అవీ తినలేనురా... నువ్వేమీ కష్టపడకు గానీ, నేను బయటకు పోయి తిని వస్తాలే!" అన్నాడు.

"అరే శ్రీ, కంగారు పడకురా బాబూ ... నీకోసం ఏదో ఒకటి చేస్తాను కదా! ముందు ఫ్రెషప్ అయిరా!" అంటూ శరత్ లేచి పార్సిల్స్ తీసి సర్దాడు.

అతడు ఉంటున్నది సింగిల్ బెడ్‌రూమ్ అపార్ట్‌మెంట్. అద్దె కాస్త ఎక్కువే అయినా అన్నిటికీ అందుబాటులో ఉంటుందని తీసుకున్నాడు. ఆ పైన తను స్వయంగా వంట చేసుకుంటాడు కనుక ఖర్చులు తగ్గుతాయి కనుక అద్దె భారంగా అనిపించలేదు అతడికి.

ఇంట్లో బ్రేక్‌ఫాస్ట్ చేసుకొని తిని వెళితే మధ్యాహ్నం లంచ్ ఆఫీస్ కాంటీన్‌లో చేస్తాడు. రాత్రికి మాత్రం తీరిగ్గా నచ్చినవి చేసుకొని తింటాడు. అప్పుడప్పుడూ తన చేతి వంటను మిత్రులకు రుచి చూపిస్తూ ఉంటాడు.

శ్రీకాంత్ టిఫిన్ తింటూ "ఏ మాటకా మాటే చెప్పుకోవాలిరా ... నీ చేత్తో ఏం చేసినా అమృతంలా ఉంటుంది. నీ దగ్గర గానీ నేనొక నెలరోజులు ఉంటే డబుల్ అయి ఊరుకుంటాను" అన్నాడు.

"అరే, దుర్మార్గుడా... నెలరోజులుండి నాతో చేయించుకొని తింటావా... నువ్వు కాలు మీద కాలు వేసుకొని తింటే, నేను వండి పెట్టడానికి నీ పెళ్లాన్నటరా?" అంటూ నవ్వాడు శరత్.

"పోనీ అందాకా అలా అనుకుంటే పోలా?" అంటూ ఆ నవ్వుతో శృతి కలిపాడు శ్రీకాంత్.

"ఆ మాటంటే మాత్రం తంతానురోరేయ్! పోన్లే గానీ త్వరగా కానిచ్చి రెడీ అవు... నిన్ను ఇంటర్వ్యూకి దింపేసి నేను మా ఆఫీసుకు వెళ్లాలి. టైం అవుతోంది" అంటూ తాను కూడా గబగబా తినడం ముగించి రెడీ అయిపోయాడు శరత్.

బైక్ స్టాండ్ తీస్తూ "ఇంటర్వ్యూ అయ్యాక సరాసరి మా ఆఫీసుకు వచ్చేయరా... ఇద్దరం కలిసి కాసేపు సరదాగా తిరిగి బైట ఎక్కడైనా డిన్నర్ చేసి వద్దాం!" అన్నాడు శరత్.

"సరే పద!" అంటూ శరత్ వెనుక కూర్చున్నాడు శ్రీకాంత్.

***

సాయంత్రం నాలుగు గంటలయింది... శ్రీకాంత్ వచ్చే వేళయింది అనుకుంటూ తాను చేయవలసిన పనులన్నీ త్వర త్వరగా ముగించేశాడు శరత్. ఇక వాడు వస్తే... మా మేనేజర్ని పర్మిషన్ అడిగి వెళ్లిపోవడమే అనుకున్నాడు హుషారుగా.

శ్రీకాంత్ ఉండే ఈ నాలుగు రోజులూ ఎలా స్పెండ్ చేయాలో మనసులోనే రకరకాలుగా ప్లాన్ చేసుకోసాగాడు అతడు.

ఇంతలో శరత్ ఫోన్ రింగవడంతో తీసి చూశాడు... డిస్‌ప్లేలో దివాకర్ నెంబర్ చూసి, ఇదేంటి ఈ సమయంలో మావయ్య ఫోన్ చేశాడు అనుకున్నాడు... మళ్లీ అంతలోనే శ్రీకాంత్ సెల్ మరిచిపోయి వచ్చాడు కదా... వాడి ఇంటర్వ్యూ సంగతి ఏమయిందో తెలుసుకుందామని నాకు ఫోన్ చేసి ఉంటాడు అనుకుంటూ... టాక్ బటన్ నొక్కి "హలో మావయ్యా!" అన్నాడు.

"అరే శరత్, శ్రీకాంత్ ఇంటర్వ్యూ నుండి వచ్చాడురా?" అనడిగాడు దివాకర్ ఆదుర్దాగా.

"ఇంకా రాలేదు మావయ్యా... వచ్చేస్తాడులే! నీ గొంతేమిటి బొంగురు పోయినట్లుగా అదోలా ఉంది. ఒంట్లో బాగులేదా?" అనడిగాడు శరత్.

"నాకేంరా నేను బాగానే ఉన్నాను... అరే శరత్, గంట క్రితం హార్ట్ ఎటాక్ వచ్చి అమ్మమ్మ పోయిందటరా!" అన్నాడు దివాకర్ ఏడ్చేస్తూ.

ఆ మాట వింటూనే శరత్ నిశ్చేష్టుడైనట్లుగా కొన్ని క్షణాలు అలా ఉండిపోయాడు. చివరికి గొంతు పెగుల్చుకుని "నిజమేనా మావయ్యా... ఇప్పుడు నువ్వు ఎక్కడ ఉన్నావు?" అనడిగాడు ఆందోళనగా.

"మేమంతా ఇప్పుడు చోడవరం వెళ్లే బస్సులో ఉన్నామురా వాడు వచ్చాక వెంటనే ఈ వార్త చెప్పకు... తట్టుకోలేడు. నెమ్మదిగా చెప్పు. త్వరగా బయలుదేరి వచ్చేయండి. జాగ్రత్త!" అన్నాడు దివాకర్.

"సరే మావయ్యా!" అంటూ ఫోన్ ఆఫ్ చేసి నిస్సత్తువుగా కుర్చీలో వాలిపోయాడు. అతడి ప్రమేయం లేకుండానే కన్నీళ్లు ధారలు కట్టాయి.

అది చూసిన పక్క సీట్లోని ఆనందరావు "ఏమిటి శరత్, ఏమైంది?" అంటూ ఆదుర్దాగా లేచి వచ్చాడు శరత్ దగ్గరకి.

అతడి చేతులు పట్టుకొని ఏడ్చేస్తూ "ఆనంద్, గంట క్రితం మా అమ్మమ్మగారు పోయారట ... ఇప్పుడే మా మావయ్య ఫోన్ చేసి చెప్పాడు" అన్నాడు.

"అయ్యో ఎంత పనయింది శరత్ ... అమ్మమ్మగారు ఎంతో ఆరోగ్యంగా ఉండేవారు కదా ... ఇంత హఠాత్తుగా ఏమైంది?" అన్నాడు ఆనందరావు సానుభూతిగా.

"హార్ట్ ఎటాక్ వచ్చిందట. నిన్న మా శ్రీకాంత్ అక్కడి నుండే వచ్చాడు ... నాకోసం అమ్మమ్మ పిండి వంటలు కూడా పంపింది ఆనంద్ ... ఇంతలోనే ఇలా అయిపోయింది" అన్నాడు శరత్ తిరిగి ఏడ్చేస్తూ.

విషయం విన్న కొలీగ్స్ అతడి వైపు సానుభూతిగా చూశారు.

"త్వరగా బయలుదేరు శరత్ ... ఆలస్యమయితే అమ్మమ్మగారి ఆఖరి చూపు అందుకోలేవు" అన్నాడు ఆనందరావు.

సావిత్రమ్మగారి మరణ వార్త వినడంతోనే ఆనందరావు మనసు కూడా భారమై పోయింది. మొన్న సంక్రాంతి పండగకు శరత్‌తో పాటు అక్కడికి వెళ్లాడు.

కళ్లల్లో కరుణ, పెదవుల మీద చెరగని చిరునవ్వుతో చూపరులను మంత్రముగ్ధులను చేస్తున్నట్లు అనిపిస్తుంది ఆమె రూపం. చూడగానే రెండు చేతులూ ఎత్తి నమస్కరించాలనిపిస్తుంది ఎవరికైనా. ఆవిడ్ని చూడడంతోనే సాక్షాత్తు పార్వతీదేవిలా ఉంది అనుకున్నాడు ఆనందరావు.

తన మనవలందరితో పాటు ఆనందరావుని కూడా ఎంతో ఆప్యాయంగా చూసింది. ఆమె చూపిన ఆదరణను అతడు జీవితంలో ఎప్పటికీ మరిచిపోలేడు... అందుకే ఆ వార్త వినగానే అతడి కళ్లూ తడిశాయి.

ఇద్దరూ కలిసి మేనేజరుగారి దగ్గరకు వెళ్లారు ... విషయం విన్న వెంటనే ఆయన లీవ్ శాంక్షన్ చేశారు.

శ్రీకాంత్ ఎపాయింట్‌మెంట్ ఆర్డరు తీసుకొని ఉరకలు వేసే ఉత్సాహంతో శరత్ ఆఫీసుకు వచ్చాడు.

అతడిని చూడడంతోనే శరత్, “వచ్చావా శ్రీ, పద వెళ్దాం!” అన్నాడు.

శరత్ ముఖంలో ఉదయం కనిపించిన సంతోషం ఇప్పుడు మచ్చుకైనా లేకపోవడంతో ఆశ్చర్యపోతూ “ఏంట్రా శరత్, అలా ఉన్నావేమి?” అనడిగాడు శ్రీకాంత్ ఆదుర్దాగా.

శరత్ జేబులో నుండి కర్చీఫ్ తీసి ముఖం తుడుచుకుంటున్నట్లుగా ... ఉబికి వస్తున్న కన్నీళ్లను తుడుచుకున్నాడు.

శరత్ కొలీగ్స్ ఇద్దరి ముగ్గురితో శ్రీకాంత్‌కి కొంచెం పరిచయం ఉంది. అంతకు ముందు ఒకటి రెండు సార్లు అతడు అక్కడికి రావడం వలన. అందరూ తమ వైపు సానుభూతిగా చూస్తున్నట్లు అనిపించి ... ఆనందరావు వైపు ప్రశ్నార్థకంగా చూశాడు శ్రీకాంత్.

వెంటనే ఆనందరావు అతని భుజం మీద చేయి వేసి “సారీ శ్రీకాంత్‌గారూ, మీ నాన్నమ్మగారు పోయారట! ఇప్పుడే ఫోన్ వచ్చింది!” అన్నాడు సానుభూతిగా చూస్తూ.

అంతవరకూ ఆనందంతో వెలిగిపోతున్న శ్రీకాంత్ ముఖం ఆ మాట వినడంతోనే వెలవెలబోయింది. షాక్ తిన్నట్లుగా చూస్తూ “నిజమేనా శరత్?” అన్నాడు అతడ్ని కుదిపేస్తూ.

నిన్న తనకి ధైర్యం చెప్పి చిరునవ్వుతో శకునం వచ్చి సాగనంపిన నానమ్మ... ఇకలేదు అనుకోగానే అతడి నవనాడులూ కృంగినట్లయ్యాయి.

“అవునురా, అమ్మమ్మ మనకిక లేదు!” అంటూ ఏడుస్తూ అతడిని చుట్టేశాడు శరత్.

ఆ ఇద్దర్నీ అలా చూస్తూ ఉంటే అందరి కళ్లూ చెమ్మగిల్లాయి.

చివరికి ఆనందరావు మాటలు కూడ తీసుకొని “మీరిద్దరూ ఇక్కడ బాధపడుతూ కూర్చుంటే ... అమ్మమ్మగారి చివరి చూపులు కూడా దక్కవు. బయలుదేరండి వెంటనే!” అన్నాడు అనునయంగా.

ఇద్దరూ భారమైన మనసులతో ఇంటికి వచ్చారు ... చేతికందిన బట్టలు బేగ్‌లో కుక్కుకుని బయలుదేరుతుండగా ... శరత్ దృష్టి ఉదయం అమ్మమ్మ తనకోసం పంపిన

పార్సిల్స్ మీద పడింది. వాటిని చూడడంతోనే సముద్ర కెరటంలా దుఃఖం పొంగుకొచ్చింది.

"అమ్మమ్మా చివరిసారి నాకోసం ఇవి చేసి పంపావా? ఇకమీదట ఇలాంటివన్నీ నాకోసం ఎవరు చేసి పంపుతారు?" అంటూ వాటిని చేత్తో పట్టుకొని ఏడ్చేశాడు శరత్.

శ్రీకాంత్ కూడా అతడిని చుట్టేసి ఏడుస్తూ "నిన్న నేను బయలుదేరుతున్నప్పుడు నాకు ధైర్యం చెప్పి ఈ ఉద్యోగం తప్పక నీకు వస్తుందిరా అంటూ నవ్వుతూ ఎదురు వచ్చి సాగనంపిందిరా... తీరా నేను సెలక్ట్ అయ్యాననే శుభవార్త వినకుండానే మనకు అన్యాయం చేసి వెళ్లిపోయింది నానమ్మ!" అన్నాడు.

ఇద్దరూ బాహ్య ప్రపంచాన్ని మరిచి అలా చాలాసేపు ఏడుస్తూ ఉండిపోయారు. చివరికి ఎలాగో మనసు కూడదీసుకుని స్టేషన్‌కి చేరుకున్నారు.

ఆదరాబాదరాగా టికెట్ తీసుకుని కదులుతున్న ట్రైన్ ఎక్కేశారు. తీరా వాళ్లు ఎక్కినది రిజర్వేషన్ కంపార్ట్‌మెంట్ అవడంతో ... చెకింగ్‌కి వచ్చిన టి.సికి విషయం చెప్పి పెనాల్టీ కట్టి బెర్త్‌లు సంపాదించుకున్నారు. కిటికీ పక్కన సైడ్ బెర్త్‌లు వచ్చాయి ఇద్దరికీ.

ఇద్దరూ ఎదురెదురుగా కూర్చొని మూగబోయినట్లు ఒకరి వైపు ఒకరు చూస్తూ ఉండిపోయారు. తిండి మీదకు గానీ, నిద్ర మీదకు గానీ వారికి ధ్యాస పోలేదు. ఇంతలో శరత్ ఫోన్ మోగింది. అన్యమనస్కంగానే శరత్ సెల్ ఆన్ చేశాడు.

"బావా, నేను విద్యను మాట్లాడుతున్నాను. ఎక్కడున్నారు ... బయలుదేరారా?" అనడిగింది ఆతృతగా.

"బయలుదేరాం విద్యా ... అంతా చేరుకున్నారా అక్కడికి?" అనడిగాడు శరత్.

"చిన్నత్తా, పెద్దత్తా, మావయ్యలు, దివాకర్ బాబాయి, పిన్ని, గౌతమ్ వచ్చారు. శంకరం బాబాయి, రమణ బాబాయి దారిలో ఉన్నారు. మరో గంటా, రెండు గంటల్లో ఇక్కడికి చేరుకుంటారు. సరే అన్నయ్య ఎలా ఉన్నాడు? వాడసలే చాలా సెన్సిటివ్ ... మనందరి కంటే వాడికే నానమ్మతో ఎటాచ్‌మెంట్ ఎక్కువ!" అంది విద్య బాధగా.

"అవును, మాట్లాడు వాడితో!" అంటూ ఫోన్ శ్రీకాంత్ చేతికిచ్చాడు శరత్.

"అన్నయ్యా!" అంటూ ... ఆ పైన మాటలు రానట్లుగా ఏడ్చేసింది విద్య.

చెల్లెలి ఏడుపు వినడంతోనే శ్రీకాంత్ కళ్లు కూడా కన్నీటి చెలమలయ్యాయి.

చివరికి కళ్లు తుడుచుకొని "ఊరుకో అమ్మా! తాతగారూ, నాన్నగారూ, అమ్మా ఎలా ఉన్నారు?" అనడిగాడు శ్రీకాంత్ ఆరాటంగా.

"తాతయ్యకు బాగా బి.పి రైజ్ అయిపోయింది అన్నయ్యా ... మాటా పలుకూ లేకుండా అలా ఉండిపోయారు. గౌతమ్ అన్నయ్య గంటకో సారి బి.పి, పల్స్ చెక్ చేస్తూ జాగ్రత్తగా చూసుకుంటున్నాడు. మేమంతా చూస్తూండగానే నానమ్మ మాట్లాడుతూ మాట్లాడుతూనే నాన్నగారి చేతుల్లో ఒరిగిపోయిందన్నయ్యా!

డాక్టరుగారిని పిలిచే వ్యవధి కూడా మాకు లేకపోయింది. నాన్నగారు బాగా షాక్ అయిపోయారు. చిన్నపిల్లాడిలా అలా ఏడుస్తూనే ఉన్నారు. ఆయనను ఆపడం

చాలా కష్టంగా ఉంది ... దివాకర్ బాబాయి ఇప్పుడే నాన్నగార్ని బలవంతాన లేపి అలా వాకిట్లోకి తీసుకువెళ్లాడు.

ఏదో జబ్బో, జ్వరమో అయితే అదో దారి. ఇలా సడెన్‌గా జరగడం... అంతా చూస్తూ ఉన్నా కూడా మాకెవరికీ నమ్మబుద్ధి కావడం లేదు. అమ్మయితే తన కన్నతల్లి పోయినట్లే గోలుగోలున ఏడుస్తోంది.

పెద్దత్తా, చిన్నత్తా అమ్మని ఓదార్చబోయి వాళ్లే ఘొల్లుమంటున్నారు. అన్నయ్యా! నాకు మనసంతా భారంగా దిగులుగా ఉంది... నువ్వుంటే ఆ దారి వేరుగా ఉండేది!" అంటూ ఏడ్చేసింది విద్య.

"ఏడవకమ్మా, ధైర్యంగా ఉండు!" అంటూ ఆ పైన ఇంకేమీ మాట్లాడలేక సెల్ ఆఫ్ చేసి శరత్‌కి ఇచ్చాడు శ్రీకాంత్.

"ఏమంటోంది విద్య?" అనడిగాడు శరత్.

"అదీ మనలాగే బాగా అప్‌సెట్ అయిందిరా ... తాతగారు మనలోకం లోనే లేరట. నాన్నగార్ని పట్టుకోవడం ఎవరికీ సాధ్యం కావడం లేదట. ఇంత జరిగినా ఇంకా నాకు నమ్మబుద్ధి కావడం లేదురా శరత్. ఇదంతా కలైతే ఎంత బావుండును?" అన్నాడు శ్రీకాంత్ బాధగా.

"నాకూ అలాగే ఉందిరా ... మొన్న నేను సంక్రాంతికి అక్కడికి వచ్చినప్పుడు అమ్మమ్మ ఎంత ఆరోగ్యంగా ఉందిరా ... నాకేం కావాలో అడిగి చేసి పెట్టడమే కాదు. కొసరి కొసరి తినిపించిందిరా తన అమృత హస్తాలతో! అంత ఆరోగ్యంగా ఉండే అమ్మమ్మ ఇంత హఠాత్తుగా ఎలా పోయిందిరా?" అన్నాడు శరత్ బాధగా చూస్తూ.

"అదేకదా నా బాధ ... నిన్న ఉదయం వెన్నెలలా చల్లగా నవ్వుతూ నాలో నిరాశను పోగొట్టి ధైర్యం చెప్పి బెస్టాఫ్ లక్ చెప్పి పంపింది నానమ్మ. తీరా నేను ఉద్యోగం సంపాదించుకున్నాననే శుభవార్త వినకుండానే వెళ్లిపోయింది.

జాతస్య మరణం ధృవం అనే మాట నిజమే అయినా ఆ మృత్యువు నానమ్మని ఇంత నిర్దయగా మన నుండి దూరం చేయడం చాలా బాధాకరంగా ఉందిరా!" అన్నాడు శ్రీకాంత్ కళ్లు తుడుచుకుంటూ.

శరత్ కూడా అవునన్నట్లుగా తల పంకించాడు.

అలా కూర్చుని ఇద్దరూ చిన్ననాటి ముచ్చట్లు ఎన్నో పంచుకున్నారు. వారలా మాటల్లో ఉండగానే శంకరం కొడుకు వంశీ ఫోన్ చేశాడు. "ఏరా ఎక్కడున్నారు మీరు?" అంటూ.

"మీరక్కడికి చేరుకున్నారా వంశీ?" అనడిగాడు శరత్.

"కార్లోనే కదా బయలుదేరాము. ఇప్పుడే చేరుకున్నాము ఇక్కడికి. నేను డ్రైవ్ చేస్తూ ఉండడం వలన మీతో మాట్లాడలేదు ... ఎందాకా వచ్చారు?" అనడిగాడు.

"నెల్లూరు వరకూ వచ్చాముర!" అన్నాడు శరత్.

ఆ తరువాత కావ్యా, సాహితీ శ్రీకాంత్ తోనూ, శరత్ తోనూ మాట్లాడారు. ప్రశాంతిలో హేమంత్ వస్తున్నట్లు చెప్పారు.

“అక్కడ మనవాళ్లందరూ నిద్రపోకుండా మేల్కొనే ఉంటారు. ఒకరినొకరు ఓదార్చుకుంటూ … కానీ ఇక్కడ మన ఫోన్ కాల్స్ వలన ట్రైన్‌లో అందరూ ఇబ్బందిపడతారు కదా! ఇక ఫోన్ చేయకండి. గౌతమ్ గానీ, చక్రీ గానీ ఫోన్ చేస్తామన్నా వద్దని చెప్పండి!” అంటూ ఫోన్ పెట్టేశాడు శరత్.

“ఇక పడుకోరా!” అని చెప్పి శ్రీకాంత్ పై బెర్త్ మీదకు వెళ్లిపోయాడు.

ఎంత ప్రయత్నించినా శరత్‌కి నిద్ర పట్టలేదు. అతడి ఆలోచనలన్నీ చనిపోయిన సావిత్రమ్మ గారి చుట్టూనే తిరుగుతున్నాయి. అలా కిటికీలో నుండి బయటకు చూస్తూ కూర్చున్నాడు.

ఆ ఇంటితో ముడిపడి ఉన్న మధురమైన బాల్యాన్ని తన మిత్రులందరికీ కథలు, కథలుగా చెప్తూ ఉంటాడు ఎప్పుడూ. ఆనందరావు లాంటి స్నేహితులను వెంటబెట్టుకొని వచ్చి తన ఊరినీ, అమ్మమ్మగారి ఊరినీ, ఊళ్లో మనుషుల ఆత్మీయతలనూ చూపించి మురిసిపోతూ ఉంటాడు.

వేసవి శెలవలు వస్తే చాలు అమ్మమ్మగారింటికి పరుగులు తీసేవాడు. పిన్నీ, మామయ్యగార్ల పిల్లలతో ఆ ఇల్లు కళకళలాడుతూ ఉండేది. శరత్, శ్రీకాంత్‌లకు వయసు కొద్ది నెలలు తేడా అంతే! ఇద్దరూ ఒకే ఈడువాళ్లు కావడంతో మిగతా పిల్లలందరికీ నాయకత్వం వహించేవారు. వాళ్లిద్దరూ ఎంత చెప్తే అంత అన్నట్లు ఉండేవారు మిగతా పిల్లలంతా.

అసలు అక్కడికి చేరుకున్నాక పిల్లలెవరికీ ఒళ్లు తెలిసేది కాదు. వారి ఆటపాటలతోనూ, అల్లరితోనూ ఆ ఇల్లు మారుమోగిపోయేది. అదో సందడి … అదో సౌరంభం … మాటలకందని ఆనందం పొందేవారంతా!

సావిత్రమ్మగారూ, అన్నపూర్ణా కలిసి ఓపికగా అందరికీ అన్నీ చేసి పెట్టడమే గాక, మధ్య మధ్యలో వాళ్ల తగువులు తీర్చి రాజీ చేస్తూ … కథలూ, కబుర్లూ చెప్పి అందర్నీ ఏకం చేసేవారు.

పగలంతా మామిడి తోటల్లోనూ, ఏటిగట్టున ఆడి ఆడి అల్లరి చేస్తూ, అలసిపోయిన పిల్లలు దీపాల వేళకు ఇల్లు చేరేవాళ్లు. స్నానాలు అయ్యాక అందరూ వెన్నెల్లో వాకిట్లో పరిచిన జంబుఖానా మీదకు చేరేవారు.

సావిత్రమ్మగారు వేడి వేడి అన్నంలో కొత్తావకాయీ, నెయ్యీ, పప్పూ వేసి ముద్దలు కలిపి అందరి చేతుల్లోనూ పెడుతూ ఉంటే ఆవురావురుమని తినేవారు. ఆ పైన ఆమె కథలు చెప్తూ ఉండగా ఊ కొడుతూనే తెలియకుండా నిద్రలోకి జారుకునేవారు.

ఏటిగట్టున ఆటలూ, స్నానాలూ … అమ్మమ్మ చేతి గోరుముద్దల విందులతో వేసవి శెలవులన్నీ ఇట్టే గడిచిపోగా … శెలవులయ్యాక అందరూ భారమైన మనసులతో

ఒకరికొకరు వీడ్కోలు చెప్పుకునేవారు. తిరిగి రాబోయే శెలవుల కోసం మరునాటి నుండే ఆత్రంగా ఎదురు చూసేవారు.

ఆ నాటి పిల్లలందరూ ఇప్పుడు పెరిగి పెద్దవాళ్లయినా ... ఏ మాలిన్యమూ అంటని వసివాడని ఆ పసితనపు ప్రేమానురాగాలు అందరి మనసులోనూ సజీవంగానే ఉన్నాయి.

గతంలో మాదిరి అందరూ తరచూ కలుసుకోలేకపోయనా, ఫోన్ల ద్వారా ఒకరి క్షేమ సమాచారాలు మరొకరు తెలుసుకుంటూనే ఉన్నారు.

ఆ ఆనందానికి కేంద్ర బిందువైన సావిత్రమ్మగారి అకాల మరణం అందరి మనసులనూ కలచివేసింది.

శరత్ చదువయి ఉద్యోగం చేస్తూ ఉన్నా తరచూ అమ్మమ్మగారింటికి వెళ్తూనే ఉంటాడు. అతడికి అమ్మమ్మా, తాతయ్యా, మేనమామల వాత్సల్యంతో బాటు శ్రీకాంత్‌తో చెలిమి శరత్‌ని అయస్కాంతంలా లాక్కు వెళ్తుందక్కడికి.

శ్రీకాంత్‌కి కూడా శరత్ అంటే ప్రాణం. శరత్‌కి రావడానికి కుదరకపోతే, శ్రీకాంతే అతడి దగ్గరకు వెళ్లి వస్తాడు. వారిద్దరిదీ అంత చక్కని, చిక్కని స్నేహం!

అతడి ఆలోచనలు చెదరగొడుతూ పై బెర్తు మీద నుండి చిన్నగా వెక్కిళ్లు వినరావడంతో దిగ్గున లేచి చూశాడు శ్రీకాంత్ వైపు. కళ్లు ఎర్రబారి ... ముఖమంతా కన్నీటి చారికలతో నిండి ఉన్న అతడి ముఖం చూడడంతోనే శరత్ మనసు బాధగా మూలిగింది.

“ఏంట్రా శ్రీ ఇది ... ఊరుకో ... బాధ నీకే గానీ, నాకు లేదా?” అంటూ సముదాయింపుగా అతడి వీపు తట్టాడు మెల్లగా.

***

సావిత్రమ్మగారి పార్ధివ దేహాన్ని వరండాలో ఒక పక్కగా వేసి ఉంచారు. ప్రశాంతంగా నిద్రపోతున్నట్లు ఉంది ఆమె ముఖం.

ఈ వయసులో తనని ఒంటరి చేసి పోయిన భార్య వైపు నిర్నిమేషంగా చూస్తూండిపోయారు జగన్నాథంగారు.

ఆమెతో గడిపిన జీవితం అంతా ఆయన కళ్ల ముందు కదలాడింది. ఏనాడూ భార్య ముఖంలో అసంతృప్తిని చూడలేదు అతడు. ఉన్నా, లేకున్నా లక్ష్మీదేవిలా నిండుగా నవ్వుతూ కనబడేది ఎప్పుడూ. ఆమె లేని జీవితం శూన్యంలా అనిపిస్తున్నది అతడికి.

మరో పక్క క్రిష్ణమూర్తి “అమ్మా ... అమ్మా!” అంటూ కంటికీ మింటికీ ఏకధారగా ఏడవసాగాడు.

కొడుకులూ, కోడళ్లూ, కూతుళ్లూ, అల్లుళ్లూ, మనవలూ అంతా ఆమె చుట్టూ కూర్చున్నారు దీనంగా చూస్తూ. క్రిష్ణమూర్తి, జగన్నాథం గారి పెద్ద కొడుకు. చోడవరం హైస్కూల్‌లో హెడ్‌మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. మంచి వ్యక్తిగా స్కూల్లోనూ, ఊళ్లోనూ

ఎంతో గుర్తింపూ, గౌరవం ఉంది అతడికి. అందుకే అతడికి వచ్చిన కష్టం తమకే వచ్చినట్లుగా ఊరు ఊరంతా అక్కడే ఉంది.

"అమ్మగారు నిన్న అనగా పోయారు ... ఇంకా ఉంచితే మంచిది కాదు. బాడీ చెడిపోతుంది" అన్నారెవరో.

దానికి జవాబుగా "మాష్టరుగారి అబ్బాయి, వారి మేనల్లుడు రావాలట! వాళ్లు వస్తేగానీ అమ్మగారిని కదల్చడానికి వీలు లేదని జగన్నాథంగారి రెండో అబ్బాయి దివాకరం చెప్పారు" అన్నాడు.

"పోనీ వాళ్లు వచ్చే లోగా మిగతా ఏర్పాట్లు చూస్తే ... వాళ్లు రాగానే కార్యక్రమాలు మొదలు పెట్టవచ్చు కదా!" అన్నాడు మొదటాయన.

"ఔను నిజమే ... పదండి, మాష్టరుగారితో ఒకమాట చెప్పి పనులు మొదలు పెడదాం!" అంటూ ముందుకు నడిచారాయన.

మిగతావారు ఆయనను అనుసరించారు.

"మాష్టారూ, మీకు చెప్పదగినవాడిని కాను ... పోయినవాళ్లతో మనం కూడా పోలేము కదా! అమ్మగారు పుణ్యాత్మురాలు గనుకే ఏ కష్టమూ లేకుండా సునాయాసంగా వెళ్లిపోయారు. అందరికీ అలాంటి చావు రమ్మన్నా రాదు కదండీ! పిల్లలు వచ్చేలోగా జరగవలసిన ఏర్పాట్లు గురించి ఆలోచిస్తే బాగుంటుంది" అన్నారాయన.

అతడి మాటలు విని క్రిష్ణమూర్తి నిస్తేజంగా చూశాడే గానీ బదులు పలకలేదు.

అన్నగారి పరిస్థితిని గమనించిన దివాకర్ "మీరు పదండి సార్, అన్నయ్యతో నేను మాట్లాడతాను" అంటూ వాళ్లని అక్కడి నుంచి పంపించేశాడు.

అన్నయ్య ఏదీ గ్రహించే స్థితిలో లేడని అనుకున్న దివాకర్, శంకరం వెంకట రమణల దగ్గరకు వచ్చాడు.

"శంకరం, చూశారు గదా అన్నయ్య పరిస్థితి ... అసలు మాట్లాడే స్థితిలో లేడు. మనమే పూనుకొని ఈ కార్యక్రమం గట్టెక్కించాలి. నా దగ్గర కూడా చాలినంత డబ్బు లేదు. మీరిద్దరూ తలో మూడు వేలూ ఇస్తే ఇప్పటికి పని జరిగిపోతుంది" అన్నాడు దివాకర్ అడగలేక అడుగుతూ.

అతడి మాటలు విని వారిద్దరూ ఒకరి ముఖాల వంక ఒకరు చూసుకున్నారు.

చివరికి శంకరం "ఈ వార్త వినడం తోనే ఇద్దరం ఉన్నపాటున బయలుదేరి వచ్చేశాము. కారులో పెట్రోలు కొట్టించుకునేందుకే డబ్బులు వెదుక్కోవలసి వచ్చింది. ప్రస్తుతానికి మా దగ్గర ఏమీ లేదు" అన్నాడు.

వెంకటరమణ కూడా దానికి వంతపాడాడు.

ఆ మాట వింటూనే దివాకర్‌కి కోపం ముంచుకువచ్చింది. "అరే ఏమిట్రా ఇది? చనిపోయింది మన అమ్మరా! వంతులు పోయేందుకు ఇదా సమయం? తలో మూడు వేలూ సర్దలేనంత దీనావస్థలో ఉన్నారా మీరు?" అన్నాడు తీవ్రంగా వారి వంక చూస్తూ.

దానికి వాళ్లిద్దరూ కలిసి పెడసరంగా ఏదో సమాధానం చెప్పారు.

ఆ సంభాషణ చెవిని పడడంతోనే ... చివ్వున తలెత్తి చూశారు జగన్నాథం గారు.

భార్య అంత్యక్రియలకు ఖర్చుల కోసం వంతులాడుకుంటున్న కొడుకులను చూడగానే అతడి మనస్సు కకావికలమైంది. నిన్న భార్య చనిపోయిన దగ్గర నుండీ ఒక్క కన్నీటి బొట్టయినా రాల్చని అతడి కళ్లు గట్టు తెగిన గోదారిలా అయ్యాయి.

ఇంతకాలం తన పెంపకం చాలా గొప్పదని లోలోపలే మురిసిపోతున్న ఆయనకి ఇది పెద్ద షాక్‌లాగా అనిపించింది.

ఈ బిడ్డల ఉన్నతి కోసం తనూ, తన భార్యా అహర్నిశలూ కష్టపడి రెక్కలు ముక్కలు చేసుకొని ఇంతవాళ్లను చేస్తే ... ఈనాడు దక్కిన ప్రతిఫలం ఇదా? ఛీ, నేనెంత దురదృష్టవంతుడను! భార్య అంత్యక్రియలకు చిల్లిగవ్వ అయినా లేని నిర్భాగ్యుడనయిపోయాను.

నాలాగే నా పెద్దకొడుకు క్రిష్ణమూర్తి కూడా సంపాదించిందంతా కుటుంబం కోసమే వెచ్చించాడు. వాడు తలచుకుంటే ఊళ్లో ఆమాత్రం డబ్బు పుట్టించకపోడు. కానీ తల్లి పోవడంతో వాడు మతిపోయినవాడిలా అయ్యాడు. ఇపుడు నేనేం చేయాలి అనుకొని అసహాయంగా అందరి వైపూ చూడసాగాడు.

వాళ్లు ముగ్గురూ అరచుకోవడం వినడంతోనే క్రిష్ణమూర్తి వర్తమానంలోకి వచ్చాడు. అతడికి కర్తవ్యం గుర్తుకు వచ్చింది. దివాకర్‌ని దగ్గరకు పిలిచి “దివా, ఏమిట్రా ఈ అరచుకోవడాలు ... ఎవరైనా వింటే ఎంత నగుబాటు మనకు? అవతల బావగార్లు ఇద్దరూ ఉన్నారు. ఈ పక్క ఊళ్లో వాళ్లు ఉన్నారు. ఇంతకాలం ఫలానా జగన్నాథంగారి పిల్లలు అని మనగూర్చి అంతా గొప్పగా చెప్పుకుంటూ ఎంతో గౌరవిస్తూ వచ్చారు. ఇప్పుడీ మాటలు వింటే వాళ్లంతా ఏమనుకుంటారు? ఆ గౌరవాన్ని మీరంతా ఈరోజు మట్టిలో కలిపేస్తారా ఏమిటి? ఒరే ప్రస్తుతానికి ఓ పదివేలు ఉంటే సర్దు. రేపు జీతాలు రాగానే ఇచ్చేస్తాను” అన్నాడు బాధగా చూస్తూ.

“అదికాదన్నయ్యా, అసలేం జరిగిందో తెలుసా నీకు? వాళ్లు కొంచెం కూడా బాధ్యత లేకుండా మాట్లాడుతూంటే ...” అంటూ వివరణ ఇవ్వబోతున్న దివాకరాన్ని మధ్యలోనే వారిస్తూ ....

“నాకంతా తెలుసురా ... చెప్పింది చేయి ముందు. ఇంకేం మాట్లాడకు!” అన్నాడు క్రిష్ణమూర్తి గంభీరంగా.

చేసేదేం లేక దివాకర్ అక్కడి నుండి వెళ్లిపోయాడు జరగవలసిన ఏర్పాట్లు చూసేందుకు.

అక్కడే ఉండి ఆ తంతు అంతా చూస్తున్న వంశీ, కావ్య, సాహితిలకు మతి పోయినంత పనయింది తమ తండ్రుల నిర్వాకం చూశాక. నెల నెలా తమకు పాకెట్ మనీగా ఇచ్చేంత కూడా లేని ఈ ఖర్చు వీళ్లు భరించలేరా? ఎంత అన్యాయం అనుకున్నారు బాధగా.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Manushulu+Mamatalu**

* * *